వనంలోకి జనం: మేడారం పరిసరాల్లో వెలిసిన భక్తుల గుడారాలు



7

సాక్షి మహబూబాబాద్

బుధవారం | 21 | ఫిబ్రవరి | 2024



తల్లీ.. వస్తున్నాం : మేడారానికి తరలివస్తున్న భక్తులు



న్యూస్‌రీల్

నోడల్ అధికారుల నియామకం

మహబూబాబాద్: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 19మంది నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 19 విభాగాలకు 19 మంది జిల్లా అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విభాగానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద, పోస్టల్ బ్యాలెట్ ఆఫ్ ఎంప్లాయీస్ విభాగానికి డీఆర్‌డీఓ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతికుమారి, పోస్టల్ బ్యాలెట్ పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్ విభాగానికి డీడబ్ల్యూఓ వరలక్ష్మి, ఈటీపీబీఎస్ విభాగానికి డీటీడీఓ ఎర్రయ్య, లాజిస్టిక్స్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగానికి కలెక్టరేట్ సూపరింటెండెంట్ భద్రకాళి, శిక్షణ విభాగం నోడల్ అధికారిగా డీఈఓ రామారావును నియమించారు. హ్యూమన్‌రిసోర్స్ విభాగానికి డీఏఓ అభిమన్యుడు, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల విభాగానికి అదనపు కలెక్టర్ డేవిడ్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ విభాగానికి ఎంవీఐ ఎండీ గౌస్ పాషా, స్వీప్ కార్యక్రమాల విభాగానికి డీఆర్‌డీఓ పురుషోత్తం, లా అండ్ ఆర్డర్ విభాగానికి అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, బ్యాలెట్ పేపర్ విభాగానికి బీసీ సంక్షేమశాఖ అధికారి నర్సింహారావు, మీడియా విభాగానికి డీపీఆర్వో శ్రీనివాసరావు, ఐటీ విభాగానికి డీఆర్‌డీఏ ఏడీ సురేష్, కంప్లైంట్ మేనేజ్‌మెంట్ విభాగానికి మానుకోట మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఏఎంఎఫ్ విభాగానికి తొర్రూరు డీపీపీఓ పుల్లారావు, కమ్యూనికేషన్ ప్లాన్ విభాగానికి ఇరిగేషన్ ఈఈ సమ్మిరెడ్డి, ఎక్స్‌పెండించర్ మానిటరింగ్ విభాగం నోడల్ అధికారిగా డీసీఓ వెంకటేశ్వర్లు నియామకమయ్యారు.

డీఏఓగా అభిమన్యుడు

మహబూబాబాద్ రూరల్: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యుడు విధుల్లో చేరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం డీఏఓగా పనిచేస్తున్న అభిమన్యుడు బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌చార్జ్ డీఏఓ లక్ష్మీనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన డీఏఓకు ఏడీఏ లక్ష్మీనారాయణ, టెక్నికల్ ఏడీఏ రాజనరేందర్, టెక్నికల్ ఏఓలు సారయ్య, స్వామి బొకే అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

మహబూబాబాద్: ఇంటర్ పరీక్షలకు తగిన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డీఐఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28నుంచి మార్చి 14వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని, విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్‌లను బంద్ చేయించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అదనపు ఎస్పీ చెన్నయ్య, డీఈఓ రామారావు ఉన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో 48 రెగ్యులర్ సెంటర్లు, ఒక ప్రైవేట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 49మంది సీఎస్‌లు, 49 మంది డీఓఎస్‌లు విధులు నిర్వహిస్తారని, వీరితో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. ఉదయం 9:30 గంటల తర్వాత విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించొద్దన్నారు. ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎంఈఓలు పూల్‌చంద్, రాము, సెక్షన్ ఇన్‌చార్జ్ షాబీర్ అలీ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లుల చెంతకు బైలెల్లె..

మేడారం మహాజాతర బాటపట్టిన భక్తులు

నేడు గద్దెపైకి కన్నెపల్లి సారలమ్మ రాకతో జాతర ప్రారంభం

- ఆసీనులుకానున్న గోవిందరాజులు, పగిడిద్దరాజు
- రాత్రి గద్దెపైకి చేరిన జంపన్న
- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం

మేడారం(ఎస్‌ఎస్‌తాడ్వాయి): వన జాతర.. జన జాతరగా మారనుంది. తెలంగాణ కుంభమేళా, ఆదివాసీ, గిరిజన సంస్కృతీసంప్రదాయాల సమ్మేళనం.. మేడారం మహాజాతర నేడు(బుధవారం) ప్రారంభం కానుంది. మాఘశుద్ధ పౌర్ణమి వెన్నెల వెలుగుల్లో కన్నెపల్లి వెన్నెలమ్మ సారలమ్మ గద్దెపైకి చేరుకుంటుంది. అలాగే కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారం చేరుకోనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, తల్లులను దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులు మేడారం బాటపట్టారు.

ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం..

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా డోలువాయిద్యాలు, నృత్యాల నడుమ కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారం గద్దెపైకి తీసుకురానున్నారు. ఏటూరునాగారం మండలంలోని కొండాయి నుంచి గోవిందరాజులును తీసుకొస్తారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు డోలువాయిద్యాల మధ్య మంగళవారం మేడారానికి బయలుదేరాడు. అటవీ మార్గంలో 70 కిలోమీటర్ల మేర కాలినడక బయలుదేరి నేటి సాయంత్రానికి మేడారానికి చేరుకుంటాడు. కాగా ముగ్గురు ఒకేసారి గద్దెలపై ఆసీనులవుతారు. జాతర రెండోరోజు గురువారం రాత్రి సమ్మక్క తల్లి గద్దెకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు జోరందుకుంటాయి. శుక్రవారం లక్షలాది మంది భక్తులు తరలివచ్చి ఒడిబియ్యం, చీరసారె, పసుపు, కుంకుమ, బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం రాత్రి తల్లులను పూజారులు తిరిగి వన ప్రవేశం చేయిస్తారు.

ఇప్పటికే 50 లక్షల మంది దర్శనం..

మహా జాతరకు ముందే 50 లక్షల మందికి పైగా భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. కాగా, జాతర నాలుగు రోజుల్లో కోటిన్నర నుంచి రెండు కోట్లపైగా భక్తులు తల్లులను దర్శించుకుంటారని అంచనాతో రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది.

సన్నద్ధం..

బుధవారం జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పోలీస్ రోప్‌పార్టీని సిద్ధం చేశారు. కన్నెపల్లి నుంచి అమ్మవారిని తీసుకువచ్చే పూజారులను తాకేందుకు భక్తులు ఎదురుచూస్తుంటారు. దీంతో పోలీసులు ముందస్తుగా రోడ్లపై భక్తులు రాకుండా కన్నెపల్లి నుంచి మేడారం గద్దెల వరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు కన్నెపల్లి సారలమ్మ గుడివద్ద పూజారులకు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు.

తరలివస్తున్న భక్తులు

మేడారం (మంగపేట): జాతరకు భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే తాకిడి పెరిగింది. బుధవారం జారత ప్రారంభ నేపథ్యంలో కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తీసుకువచ్చే అపూర్వ ఘట్టాన్ని వీక్షించి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పలు రాష్ట్రాల నుంచి ఎడ్ల బండ్లు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ట్రాక్టర్లు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో మేడారం చేరుకుంటున్నారు. రెడ్డిగూడెం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, శివరాంసాగర్, చిలకలగుట్ట తదితర ప్రాంతాలు మంగళవారం మధ్యాహ్నం వరకు ఖాళీగా దర్శనమివ్వగా సాయంత్రం 5గంటల తర్వాత భక్తుల గుడారాలు వెలిశాయి. అశేష భక్తజనంతో మేడారంలో సందడి నెలకొంది.





జై సమ్మక్క: జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, వాగులో సరదాగా బంతాట..

ఎడ్ల బండ్లపై..



మేడారం (మంగపేట): మంగపేట మండలం కమలాపురం నుంచి సుమారు 50 ఎడ్ల బండ్లలో భక్తులు మంగళవారం రాత్రి మేడారం బయలుదేరారు. వారి వారి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఎడ్ల బండ్లపై ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేసుకుని పయనమయ్యారు. మూడు రోజుల పాటు తల్లుల సన్నిధిలో విడిది చేస్తారు.



గద్దెకు చేరిన జంపన్న



మేడారం (ఎస్ఎస్ తాడ్వాయి): కన్నెపల్లి గ్రామంలోని జంపన్న మంగళవారం రాత్రి స్నానఘట్టాల సమీపంలోని గద్దెపై కొలువు దీరాడు. ఉదయం కన్నెపల్లి గ్రామంలో పూజారి పోలెబోయిన సత్యం జంపన్న పడిగెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పూజారి సత్యం, పూజారులు కలిసి డోలువాయిద్యాలతో మేడారంలోని స్నానఘట్టాల సమీపంలోని గద్దెపై ప్రతిష్ఠించారు. జంపన్నను గద్దెకు తీసుకువస్తున్న క్రమంలో కన్నెపల్లి ఆడపడుచులు, గ్రామస్తులు ఎదురెళ్లి నీళ్లు ఆరగించారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఐజీ తరుణ్‌జోషి

మేడారం (ఏటూరునాగారం): జాతరలో అన్ని ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఐజీ తరుణ్‌జోషి అన్నారు. మంగళవారం మేడారం కమాండ్ కంట్రోల్ రూంలో ఎస్పీ, ఏఎస్పీలతో సమీక్షించారు. గతంలో కంటే ఈసారి అదనంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయించామన్నారు. వన్‌వే ద్వారా ప్రైవేట్ వాహనాలను తరలిస్తామని చెప్పారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలు, డ్రోన్లతో మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. నేడు (బుధవారం) సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులును తీసుకెళ్లే మార్గాలు, రోప్‌పార్టీలను సిద్ధం చేసి ఉంచాలని ఆదేశించారు. కేటాయించిన బీట్‌లో అనునిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఏ



ఎస్పీలతో మాట్లాడుతున్న ఐజీ తరుణ్‌జోషి

అవసరం ఉన్నా వెంటనే సెట్ల ద్వారా సమాచారం చేరవేయాలని సూచించారు. క్యూలైన్ల వద్ద ఎప్పటికప్పుడు భక్తుల రద్దీ లేకుండా వెంటవెంటనే పంపించాలన్నారు. ఆయన వెంట ఎస్పీలు శబరీష్, గౌష్‌ఆలం, ఏఎస్పీలు ఉన్నారు.

వరుడై వెళ్లి.. 'మరుబెల్లి'కి రావయ్యా..

పెళ్లికొడుకుగా మేడారం బయలుదేరిన పగిడిద్దరాజు

- దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- కాలినడకన బయలుదేరిన వడ్డెలు, పూజారులు
- గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో రాత్రి బస



పగిడిద్దరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు

గంగారం/గోవిందరావుపేట/ఎస్ఎస్‌తాడ్వాయి: : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మంగళవారం మేడారం బాటపట్టాడు. సాయంత్రం వరకు గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం చేరుకున్నాడు. రెండేళ్లకోసారి జరిగే జాతరకు పగిడిద్దరాజు పడిగెను పెనక వంశీయులు అటవీమార్గం గుండా తీసుకెళ్లారు. బుధవారం సాయంత్రానికి గద్దెపైకి చేరుకుంటాడు.

వరుడిగా తయారు చేసి..

పెనక వంశీయులు పగిడిద్దరాజును వరుడిగా తయారు చేసి మేడారానికి తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా తలపతులు పెనక వెంకటేశ్వర్లు ఇంట్లో పసుపు, కుంకుమతో పూజలు చేసి అక్కడి నుంచి నేరుగా డప్పు వాయిద్యాలతో పగిడిద్దరాజు దేవాలయానికి వెళ్లారు. ఈక్రమంలో మహిళలు నీళ్లు ఆరబోశారు. శివసత్తుల పూనకాలు, కేరింతల నడుమ దేవాలయానికి భారీగా భక్తులు చేరుకొని పసుపు, కుంకుమను ఎరుపు రంగు బట్టతో కప్పి దేవాలయంలో పెట్టారు. అనంతరం వనం (వెదురు)ను తీసుకొచ్చి పగిడిద్దరాజు (పడిగె రూపంలో)ను పెళ్లి కొడుకుగా తయారుచేశారు. గద్దెపై ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించారు. అనంతరం వడ్డె కల్తి జగ్గారావు పడిగెను పట్టుకొని గ్రామం గుండా బయలుదేరారు. ఆయనతో పాటు పూజారులు సైతం తరలివెళ్లారు. పగిడిద్దరాజు గ్రామం దాటే వరకు మహిళలు నీళ్లు ఆరబోస్తూ 'వరుడై వెళ్లి.. మరుబెల్లికి రావయ్యంటూ..' అంటూ మొక్కలు చెల్లించారు.

అడవిలో 70 కిలోమీటర్లు..

పూనుగొండ్ల గ్రామం నుంచి వడ్డెలు, పూజారులు పగిడిద్దరాజును మేడారం తీసుకెళ్తుండగా.. గిరిజన తండాలు, ఆదివాసీ గూడేల నుంచి వందల మంది భక్తులు వెంట వెళ్లారు. సమారు 70 కిలోమీటర్లు అటవీమార్గం గుండా కాలినడకన మేడారం చేరుకుంటారు. ఈ క్రమంలో కర్లపల్లి–లక్ష్మీపురంలోని పెనక సాంబయ్య ఇంట్లో మంగళవారం రాత్రి సేద దీరి.. ఆయన ఇచ్చిన విందును స్వీకరించారు. కాగా గ్రామంలో ఉన్న గద్దెపై పగిడిద్దరాజు పడిగెను ప్రతిష్ఠించారు. లక్ష్మీపురానికి చేరుకున్న పగిడిద్దరాజును మంత్రి ధనసరి సీతక్క దర్శించుకున్నారు. కాగా, తెల్లవారుజామున నాలుగు గంటలకు తిరిగి ప్రయాణం కొనసాగిస్తారు. బుధవారం సాయంత్రం 6గంటల వరకు మేడారం చేరుకుంటామని ప్రధాన పూజారులు పెనక రాజేశ్వర్, పురుషోత్తం, సురేందర్, రాహుల్, వీరస్వామి, వెంకటేశ్వర్లు చెప్పారు.

రెండు రోజుల తర్వాత మరుబెల్లి జాతర..

మేడారంలో సమ్మక్కతో వివాహ అనంతరం మూడు రోజులు పాటు పగిడిద్దరాజుకు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. శనివారం సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజులు వన ప్రవేశం చేయనుండగా.. పగిడిద్దరాజు తిరిగి పూనుగొండ్లకు చేరుకుంటాడు. వచ్చిన రెండు రోజుల తర్వాత మరుబెల్లి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

స్వచ్ఛంద సేవ..

పూనుగొండ్ల పగిడిద్దరాజు ఆలయం వద్ద గిరిజన యువకులు స్వచ్ఛందంగా పనిచేశారు. పగిడిద్దరాజు బయలుదేరి వెళ్లే కార్యక్రమాన్ని అధికారులు డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. అడిషనల్ డీసీపీ మురళీధర్, ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి, సీఐ రంజిత్ కుమార్, ఎస్సై పూనెం కార్తీక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పగిడిద్దరాజుకు స్వాగతం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం యాపాలగడ్డ నుంచి సోమవారం పగిడిద్దరాజుతో బయల్దేరిన అరెం వంశీయులు మంగళవారం రాత్రి ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి–లక్ష్మీపురానికి చేరుకున్నారు. ఈమేరకు మేడారం ట్రస్టుబోర్డు చైర్మన్ లచ్చుపటేల్, సమ్మక్క ప్రధాన పూజారి స్వామి, తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, కాంగ్రెస్ తాడ్వాయి మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ ముదురుకోళ్ల తిరుపతి వారికి స్వాగతం పలికారు. కాగా మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును తీసుకొచ్చిన పెనక వంశీయులను అరెం వంశీయులు కలిశారు. ఇద్దరు కలిసి పగిడిద్దరాజు ప్రతిమలతో బుధవారం మేడారానికి చేరుకుంటారు.

అనుబంధాల జాతర

- మేడారం దర్శనంతో పెరుగుతున్న ఆత్మీయత
- ట్రాక్టర్, వ్యాన్ పూలింగ్‌పై జనాల ఆసక్తి

మేడారం.. ఖాకీవనం

పోలీసుల ఆధీనంలో జాతర

దేవతామూర్తులు.. ఈ పూజారులు

కాక సారయ్య, కొక్కెర క్రిష్ణయ్య చేతులతో గద్దెలపైకి తల్లులు



తనివితీరా మొక్కులు..

వనదేవతలను దర్శించుకున్న భక్తులు

- వివరాలు 8లో ▸

చెరువుల పరిరక్షణకు చర్యలు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు, బంధం చెరువు, కంబాల చెరువును అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్, నీటిపారుదల శాఖ, మున్సిపాలిటీ, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా నిజాంచెరువుకు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేయాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఈఈ సమ్మిరెడ్డి, ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ నర్సింహమూర్తి, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్ ఉన్నారు.

మినీ జాతరల సందడి

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో మినీ జారతలు సిద్ధమయ్యాయి. నేటి నుంచి సమ్మక్క– సాలరమ్మ జాతర ప్రారంభం కానుండగా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈమేరకు పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంది. జిల్లాలోని బయ్యారం, గార్ల, గూడూరు, మహబూబాబాద్, చిన్నగూడూరు మండలాల్లో మినీ జాతరలు జరగనున్నాయి. ప్రధానంగా గూడూరు మండలం దామరవంచ చింతగట్టు వట్టివాగు వద్ద నిర్మించిన అమ్మవారి గద్దెల వద్ద, ఏపూరు సమీప పాకాల నది ఒడ్డున గబ్బిలా మడుగు సమీపంలో ఏర్పాటు చేసిన గద్దెల వద్ద పెనక వంశీయులు పూజలు నిర్వహిస్తారు. మేడారానికి పగిడిద్దరాజును తీసుకెళ్లినట్టే పూనుగొండ్ల నుంచి ఈ ప్రాంతాలకు కూడా పనువు తీసుకొస్తారు. అదేవిధంగా బయ్యారం మండలం నామాలపాడు వద్ద తురుసం వంశీయులు పూజలు నిర్వహిస్తారు. గంధంపల్లి, మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, కొత్తగుంపు రేగడితండా, పర్వతగిరి ప్రాంతాల్లో గిరిజనేతరులు స్వయంగా నిర్మించుకున్న గద్దెల వద్ద పూజలు చేస్తారు. వీటితోపాటు



గార్ల మండలం ముల్కనూరు, దుంపెలగూడెం, అంకన్నగూడం, చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులతోపాటు, ఇతర కులస్తులు పూజలు చేయడంతో పాటు ముడుపులు కట్టి మొక్కులు చెల్లిస్తారు.

పూలతో గద్దెల అలంకరణ



మేడారం(ఏటూరునాగారం) : మేడారంలో నేడు కొలువు దీరనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను పలు రకాలతో పూలతో అలంకరించారు. తీరొక్క పూలతో సారలమ్మ ముఖచిత్రం కనిపించేలా అలంకరించడంతో భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కాగా, సమ్మక్క గద్దెను కూడా మంగళవారం రాత్రి వరకు అలంకరించారు.

హుండీల ఏర్పాటు



గద్దెల వద్ద ఏర్పాటు చేసిన హుండీలు

మేడారం(ఏటూరు నాగారం): మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో భక్తులు సమర్పించే కానుకల కోసం దేవాదాయశాఖ అధికారులు హుండీలను ఏర్పాటు చేశారు. 452 ఇనుము, 100 క్లాత్ హుండీలను సిద్ధం చేశారు. సమ్మక్క పేరుతో 200, సారలమ్మ పేరుతో 200, పగిడిద్దరాజు పేరుతో 26, గోవిందరాజుల పేరుతో 26 హుండీలు సిద్ధం చేశారు. మరో 60 హుండీలు మరమ్మతులో ఉన్నాయని, వాటిని కూడా సిద్ధం చేస్తామని దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ అనిల్ తెలిపారు. వీటితోపాటు వంద క్లాత్ హుండీలు సిద్ధంగా ఉన్నాయి.



మేడారం జాతరలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

అనుబంధాల జాతర..

మేడారం దర్శనంతో పెరుగుతున్న ఆత్మీయత

- ట్రాక్టర్, వ్యాన్ పూలింగ్‌పై జనాల మొగ్గు
- ఒకే వాహనంలో వెళ్లేందుకు బంధువులు, గ్రామస్తుల ఆసక్తి
- ఉమ్మడి వరంగల్ నుంచి మేడారం జాతరకు వెళ్లొస్తున్న ప్రజలు



సకుటుంబ సమేతంగా మేడారం వెళ్తున్న భక్తులు

నేటి సమాజంలో అందరిదీ ఉరుకుల పరుగుల జీవితమే. ఉదయం లేచింది మొదలు.. రాత్రి నిద్రించే వరకు ఉద్యోగం, వ్యాపారం, సేవ, తదితర రంగాల్లో ప్రతీ ఒక్కరూ క్షణం కూడా ఖాళీ లేకుండా బిజీబిజీగా మారుతున్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలను మరిచిపోతున్నారు. ఫలితంగా కుటుంబ విలువలు, అనుబంధాలు కనుమరుగవుతున్నాయి. ఈ తరుణంలో ప్రతీ రెండేళ్లకు ఒకసారి జరిగే ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర కనుమరుగవుతున్న అనుబంధాలను కలుపుతోంది. మమతానురాగాలను రుచిచూపిస్తోంది. ఫలితంగా జాతరకు బంధువులు, గ్రామస్తులు ఒకే వాహనంలో వెళ్తూ బంధాలను బలపరుచుకుంటున్నారు.

సాక్షి, వరంగల్ :

హైదరాబాద్‌తో పాటు వివిధ నగరాల్లో స్థిరపడిన ఉమ్మడి వరంగల్ వాసులు మేడారం జాతరకు తమ కుటుంబాలతో పాటు గ్రామాల్లోని బలగంతో వెళ్తున్నారు. ఇందులో భాగంగా కారు పూలింగ్ మాదిరి ట్రాక్టర్, వ్యాన్, ట్రాలీ పూలింగ్ విధానంలో తల్లుల దర్శనానికి చేరుకుంటున్నారు. స్థలం విశాలంగా ఉండే ఈ వాహనాల్లో కూర్చుని అందరితో మమేకమవుతూ చిన్నప్పటి స్మృతులు నెమరవేసుకుంటూనే ప్రస్తుత కుటుంబ పరిస్థితులు ఒకరితో ఒకరు చెప్పుకుంటూ సంబురంగా సాగుతున్నారు. మధ్యమధ్యలో పచ్చని వాతావరణం ఉండే ప్రాంతంలో వాహనాలు నిలిపి సహపంక్తి భోజనాలు చేసుకుంటూ ఉత్సాహంగా మేడారం చేరుకుంటున్నారు.

పూలింగ్‌పై మొగ్గు..

గతంలో ఎవరికీవారు మేడారం జాతరకు వెళ్లే ఊరుజనం ప్రస్తుతం కలిసి వెళ్లడానికి ప్రాధాన్యమిస్తున్నారు. బస్సులు, ఆటోల్లో వెళ్లేందుకు ఆసక్తి కనబరిచే పల్లెటూరు వాసులు.. ప్రస్తుతం ట్రాక్టర్లు, వ్యాన్, ట్రాలీలపై ఆసక్తి కనబరుచుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ లాంటి మహానగరాల్లో వాతావరణ కాలుష్యం తగ్గించడంతో పాటు ప్రయాణికుల ఆర్థిక భారం తగ్గేందుకు చాలామంది ఉద్యోగులు కారు పూలింగ్ విధానానికి మొగ్గుచూపుతున్నారు. కాగా, కారు పూలింగ్ అనగా.. ఏదైనా ఒక ప్రాంతంలోని కార్యాలయానికి వెళ్లే ఐదుగురు వ్యక్తులకు కార్లు ఉన్నాయకుంటే ఎవరికివారు తమ కార్లలో కార్యాలయానికి రావడం ద్వారా ఇంధనం రూపేణా ఆర్థిక భారం పడుతుంది. అదే విధంగా ఆ ఐదు వాహనాల వల్ల వాతావరణం కాలుష్యమవుతుంది. అందుకే ఈ ఐదుగురిలో ఒక్కొక్కరు రోజూ తమ వాహనంలో మిగతా నలుగురిని కూడా ఎక్కించుకొని రావడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుంది. అదే సమయంలో వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది. ఈ విధానాన్నే కారు పూలింగ్‌గా పిలుస్తారు. ఇప్పుడూ ఈ పద్ధతిలోనే మేడారం జాతరకు ట్రాక్టర్ పూలింగ్, వ్యాన్ పూలింగ్ ద్వారా జనాలు వస్తున్నారు. ఈ విధానం వారిలో వినోదాత్మక ప్రయాణం కావడంతో పాటు బంధాలు పెనవేసేలా ఉండడంతో మేడారం వైపునకు ఉత్సాహంగా సాగుతున్నారు.

జాతర.. మా బలగాన్ని పెంచింది



మా మనువరాలు బాగుంటే మేడారం వెళ్లి అమ్మవారికి ఎత్తు బంగారం(బెల్లం) సమర్పిస్తామని మొక్కుకున్నాం. అందుకే ఊరి నుంచి ట్రాక్టర్లో మా బంధువులతో పాటు కొందరు గ్రామస్తులం కలిసి మేడారం వెళ్లాం. అక్కడ అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నాం. ఆ తర్వాత సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపాం. కబుర్లతో బంధువులు, గ్రామస్తుల మధ్య అనుబంధం మరింత పెరిగింది. చిన్న మనస్పర్థలున్న వారు కూడా ఒకటై ఆడిపాడారు. ఈ జాతర మా బలగాన్ని రెట్టింపు చేసింది. .

-కె.యాదగిరి, బంధనపల్లి గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లా

తనివితీరా మొక్కులు..

- వనదేవతలను దర్శించుకున్న భక్తులు



తల్లుల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారం (ఏటూరునాగారం): మేడారం సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులకు భక్తులు మంగళవారం తనివితీరా మొక్కులు చెల్లించారు. మొదట జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు. గద్దెల వద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి కుంకుమ, పసుపు, చీరసారె, నిలువెత్తు బంగారం సమర్పించి తల్లులకు ప్రణమిల్లారు. అనంతరం సమీప ప్రాంతాల్లో విడిది చేశారు. కాగా, గంట గంటకూ భక్తుల రద్దీ పెరుగుతుండడంతో దర్శనానికి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బొడ్రాయి వద్ద నుంచి వీఐపీ క్యూలైన్, ఇంగ్లిష్ మీడియం స్కూల్ వైపు మరో క్యూలైన్, ఐటీడీఏ క్యాంప్ కార్యాలయం వద్ద క్యూలైన్లను ఏర్పాటు చేసి వాటి గుండా భక్తులను గద్దెల వద్దకు పంపుతున్నారు. అలాగే, రోడ్లపై షాపులు లేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఐటీడీఏ క్యాంప్ కార్యాలయం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను గద్దెల వైపునకు రాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కాగా, గద్దెల వద్ద కొబ్బరికాయలు కొడుతున్న సందర్భంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన శ్రీజకు గాయం కా వడంతో అక్కడే ఉన్న సింగరేణి రెస్క్యూ టీం, వైద్య సిబ్బంది వెంటనే టీటీడీ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తరలించారు.

కాలినడకన మేడారానికి..

మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. కాగా కొందరు భక్తిభావంతో పాటు పర్యావరణ రక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనకు, సంతానప్రాప్తి కలిగించని, వ్యాపారంలో అమ్మవార్ల ఆశీస్సులు ఉన్నాయని, కోర్కెలు తీరాయని ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి పలువురు భక్తులు మేడారానికి పాదయాత్ర చేస్తున్నారు.



కాలినడకన వస్తున్న హనుమకొండకు చెందిన భక్తులు

మేడారం(గోవిందరావుపేట) : హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన భక్తుడు పెశెట్టి యాదగిరి తన మిత్రులతో కలిసి సోమవారం బయలుదేరి మంగళవారం సాయంత్రం మేడారం తల్లుల వద్దకు చేరుకున్నారు. వివాహమై సంతానం కలగాలని యాదగిరి, వ్యాపారంలో అమ్మవార్ల ఆశీస్సులు ఉన్నాయని కొడపాక కార్తీక్, పోరె రమేష్ పాదయాత్ర చేస్తున్నారు.

పదిజాతరల నుంచి పాదయాత్రగా..



కాలినడకన మేడారం వస్తున్న భక్తులు

మేడారం(ములుగు రూరల్) : మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనానికి పది జాతరల నుంచి పాదయాత్రగా వస్తున్నాం.. గతంలో జాతరకు వ చ్చేందుకు రవాణ సౌకర్యం లేక తాతల కాలం నుంచి ఎడ్లబండ్లు, కాలినడక వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించడం అనవాయితీ. ఇంటి ఇలవేల్పులుగా తల్లులను కొలుస్తాం. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు నుంచి గతంలో 20 మందితో కలిసి కాలనడకన వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నాం. ప్రస్తుతం చుట్టు పక్కల గ్రామాల నుంచి మొత్తం 625 మంది ఐదు గ్రూపులుగా మేడారం మహాజాతరకు కాలినడకన వెళ్లి అమ్మవా ర్లను దర్శించుకొని మొక్కులు చెల్లిస్తున్నాం. జాతర ప్రారంభానికి ఆరురోజుల ముందు పాదయాత్ర ప్రారంభించి మేడారం చేరుకుంటామని బేడబుడగ జంగాల యువకులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు..



మేడారం(ఏటూరు నాగారం) : కోటిమందికి పైగా తరలివచ్చే భక్తులతో మేడారంలో ఎక్కడ చూసిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్, కోళ్లు, మేకల వ్యర్థాల దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో తన వంతుగా భక్తులకు కొంతైనా అవగాహన కల్పించేందుకు కాజీపేటకు చెందిన పర్యావరణ కార్యకర్త, మేధిని సాంఘిక సేవ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి కొలిపాక ప్రకాశ్ సోమవారం హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద పాదయాత్ర చేపట్టారు. బుధవారం ఉదయం మేడారానికి చేరుకొని వనదేవతలను దర్శించుకోనున్నట్లు ఆయన తెలిపారు.

జాతరలో మొబైల్ ఏటీఎం



మొబైల్ ఏటీఎం ఏర్పాటు చేసిన అధికారులు

మేడారం(ఎస్ఎస్ తాడ్వాయి): మేడారంలో భక్తుల సౌకర్యార్థం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం మొబైల్ ఏటీఎం తోపాటు డిజిటల్ హుండీ ఏర్పాటు చేశారు. డిజిటల్(ఫోన్ పే,గూగుల్‌పే) హుండీ ద్వారా భక్తులు వారి కానుల మొక్కులు చెల్లించుకోవచ్చని బ్యాంక్ అధికారులు తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా ప్రసాదం సంచులను కూడా ఏర్పాటు చేశారు. భక్తులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఏజీఎం మాధవి, డీఎం మైలారప్ప, మేనేజర్ లకావత్ సునీల్ కుమార్, సైదులు, రాములవారు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో మొబైల్ ఫైర్ సేవలు



మేడారం(కన్నాయిగూడెం) : మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో మొబైల్ ఫైర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మంగళవారం నుంచి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో అధికారులు ఈ సర్వీస్‌లు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనాలపై సైరన్ చేస్తూ ఇవి కలియ తిరుగుతున్నాయి. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన క్షణాల్లోనే ప్రమాద స్థలానికి చేరి నష్ట నివారణకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మేడారం.. ఖాకీవనం

- పోలీసుల ఆధీనంలో జాతర
- ఎక్కడికక్కడ చెక్‌పోస్టుల ఏర్పాటు
- స్థానికుల రాకపోకలకు ఆంక్షలు



మేడారం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు

మేడారం(ఎస్ఎస్‌తాడ్వాయి): మేడారం.. ఖాకీ వనమైంది. సమ్మక్క– సారలమ్మ జాతర పోలీసుల ఆధీనంలోకి వెళ్లింది. నేటి (బుధవారం) నుంచి జాతర ప్రారంభం కానుండడంతో సోమవారం రాత్రి నుంచే పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా వాహనాలను మేడారంలోకి రాకుండా ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. రహదారులు, కల్వర్టులు, జాతర పరిసరాలు, తదితర ప్రాంతాలను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకున్నారు.

స్థానికుల రాకపోకలకు అనుమతి నిరాకరణ

పోలీసులు స్థానికుల రాకపోకలకు అనుమతి నిరాకరిస్తున్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ఆర్చ్ వద్ద నుంచి ఆర్టీసీ బస్సులను మాత్రమే మేడారానికి అనుమతి ఇస్తూ నర్సింగాపూర్, కామారం, తాడ్వాయి, ఇందిరానగర్ గ్రామాల్లోని ప్రజలను అడ్డుకుంటున్నారు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, మేడారానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పడిగాపూర్, ఎల్బాక, వెంగ్లాపూర్ గ్రామాల్లోని ప్రజలు వ్యవసాయ పనులు, వైద్య సేవలు, ఇతర అవసరాల కోసం పస్రా, నార్లాపూర్ వెళ్లాల్సి ఉండగా నార్లాపూర్ చింతల్ క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసులు అడ్డుకుంటున్నారు. ఫలితంగా ఈ గ్రామాల్లోని ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో రాష్ట్ర మంత్రి సీతక్క స్పందించి రాకపోకలకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెట్రోల్‌కు కూడా వెళ్లనీయడం లేదు



మండల కేంద్రంలోని మేడారం వెళ్లే దారిలో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు అనుమతించడం లేదు. ఆర్చ్ దాటి వెళ్లాలంటే ఐడీ కార్డులు చూపించమంటున్నారు. మాకు ఆధార్ కార్డు తప్ప మరే ఇతర ఐడీ కార్డులు లేవని చెప్పినా పట్టించుకోవడం లేదు. బతిమిలాడినా ససేమిరా అంటూ వెనక్కి పంపుతున్నారు. జాతర నాలుగు రోజుల బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో అధికారులు స్పందించి అవసరాల నిమిత్తం స్థానిక ప్రజల ద్విచక్రవాహనాలను అనుమతించాలి.

రాకూర్ సురేందర్‌సింగ్, తాడ్వాయి గ్రామస్తుడు

ట్రాఫిక్ జామ్.. భక్తుల అవస్థలు



ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసులు

మేడారం(మంగపేట): మేడారం ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద ఆర్టీసీ బస్సులు, లారీలు చిక్కుకోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఫలితంగా అరగంట పాటు భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ మెయిన్ రోడ్డు ద్వారా పోలీస్ ఫోర్స్‌తో వచ్చిన ఆర్టీసీ బస్సులు, సామగ్రితో వచ్చిన లారీలకు ఇతర వాహనాలు ఎదురుపడ్డాయి. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వెంటనే స్పందించి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కాగా, రద్దీ ప్రాంతాల్లోకి బస్సులు, లారీలు, ఇతర పెద్ద వాహనాలు రాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

అద్దె ఇళ్లలోకి భక్తులు..




రెడ్డిగూడెంలోని ఓ ఇంట్లో అద్దెకు దిగుతున్న భక్తులు

మేడారం(మంగపేట): మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు మంగళవారం నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. బుధవారం సారలమ్మ గద్దెకు చేరనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు అద్దె ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో జాతర పరిసరాల్లోని ఇళ్లలో సందడి నెలకొంది. మేడారం, రెడ్డిగూడెం, ఊరట్టం, కొత్తూరు తదితర ప్రాంతాల్లోని ఇళ్లను భక్తులు అద్దెకు తీసుకుంటారు. దేవతలు వనప్రవేశం అనంతరం భక్తులు తమ స్వస్థలాలకు వెళ్తారు. కాగా, గతేడాది రూ. 1500 నుంచి రూ. 2000 వరకు లభించిన అద్దె గుడారాలు.. ఈ ఏడాది రూ. 2500 నుంచి రూ. 3500 లభిస్తున్నాయి. దీంతో ఆర్థికభారమైనా భక్తులు అద్దెకు తీసుకుంటున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- మహ్మద్‌గౌస్‌పల్లి సమీపంలో ఘటన
- మేడారం భక్తులకు గాయాలు



ఆందోళనతో హైవేపై నిలిచిన వాహనాలు

ములుగు రూరల్ : మేడారం మహా జాతరకు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం భువనగిరి నుంచి భక్తులు ట్రాక్టర్‌లో మేడారం జాతరకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మహ్మద్‌గౌస్‌పల్లి–మల్లంపల్లి మధ్య ఆర్టీసీ బస్సు.. ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ట్రాలీ బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న రాములమ్మకు తీవ్రగాయాలు, మిగతా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాములమ్మకు కుడి చేయి విరగడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవాలని బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న ములుగు సీఐ రంజిత్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకొని భక్తులకు నచ్చజెప్పారు. అయినా వినకపోవడంతో ఆందోళనకారులను చదరగొట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కాగా, సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు.

దేవతామూర్తులు.. ఈ పూజారులు

- కాక సారయ్య, కొక్కెర క్రిష్ణయ్య చేతులతోనే తల్లులు గద్దెలపైకి..
- కీలకఘట్టం చూసేందుకు కోటిభక్తుల ఎదురుచూపు



బూర ఊదుతున్న పూజారులు (ఫైల్)



సారలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న సారయ్య (ఫైల్)

మేడారం(ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం): తల్లులను గద్దెలపైకి తీసుకువచ్చే దేవతా మూర్తులు.. సమ్మక్క, సారలమ్మ పూజారులు. బుధవారం కన్నెపల్లి నుంచి సారలమ్మ, గురువారం చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని వారు గద్దెలపైకి తీసుకురానున్నారు. అమ్మవార్లను పూజారులు తీసుకువచ్చే క్షణాలను చూసేందుకు భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. తన్మయత్వంతో అమ్మవార్లను గుడి, గుట్టల నుంచి పూజారులు తీసుకువచ్చే క్రమంలో దారులన్నీ భక్తిపారవశ్యంతో ఊగిపోతుంటాయి. ఒక్కో అడుగు ముందుకు పడుతుండగా ధ్వనులు, డోలు వాయిద్యాలు, బూర కొమ్ములతో అమ్మవార్లను తీసుకువస్తున్న క్రమంలో దారిపొడువునా భక్తులు నీరాజనాలు పలుకుతారు. ఈ అపూర్వమైన ఘట్టాన్ని చూసేందుకు కోటి మంది భక్తులు ఎదురు చూస్తుంటారు.

వెదురు బుట్టలో వరాల తల్లి

కన్నెపల్లిలో కొలువైన సారలమ్మకు గుడి వద్ద ప్రధాన పూజారి కాక సారయ్య భక్తి శ్రద్ధలతో రహస్య పూజలు నిర్వహించి వెదురుబుట్టతో మేడారం బయలుదేరుతారు. ముందుగా హనుమాన్ జెండా నీడలో సారలమ్మను గుడి నుంచి బయటకు తీసుకురాగా, కన్నెపల్లి గ్రామంలోని ఆడపడుచుల మంగళహారతులు, నీళ్లు ఆరబోసి స్వాగతాలు పలుకుతారు. అనంతరం మేడారం గ్రామానికి ప్రధాన పూజారి బయలుదేరుతారు. ఈక్రమంలో సారలమ్మ ఆ పూజారి కాళ్లను తాకేందుకు లక్షలాది మంది భక్తులు పోటీపడుతుంటారు. కన్నెపల్లి సారలమ్మను గత పూజారి సారయ్య 2002వ సంవత్సరం నుంచి తీసుకువస్తున్నారు. అది తండ్రి నుంచి ఆయనకు వారసత్వంగా వచ్చింది. సారలమ్మను గద్దెపై సారయ్య తన చేతులతోనే ప్రతిష్ఠిస్తారు. కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చే దారిలో ఉన్న జంపన్నవాగు మీది నుంచి కాకుండా వాగులో నీటిలో తన పాదాలను తాకించి గద్దెకు చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



కొక్కెర క్రిష్ణయ్య, సమ్మక్క పూజారి



కాక సారయ్య, సారలమ్మ పూజారి



ధూపం వేస్తున్న నాగేశ్వర్‌రావు

కొంగుబంగారం.. కోర్కెలు తీర్చే తల్లి

వెదురుగుట్టలో కొలువైన కోర్కెలు తీర్చే సమ్మక్క తల్లిని గురువారం సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య (వడ్డె) తన చేతుల మీదుగా పూజారులతో కలిసి గద్దెపైకి తీసుకువస్తారు. చిలకలగుట్టలో ఉన్న అమ్మవారి కుంకుమ భరిణికి పూజారులు ప్రత్యేక పూజలు చేసి వడ్డె క్రిష్ణయ్య చేతుల్లోకి అందించగానే ఆయనను అమ్మవారు ఆవహిస్తారు. గద్దెలపై ప్రతిష్ఠించే వరకూ ఆయన తన్మయత్వంతో ఉంటారు. అవిరేణి కుండలో కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్కకు భక్తిశ్రద్ధలతో చిలకలగుట్టపై రహస్య పూజలు నిర్వహిస్తారు. డోలువాయిద్యాలు, బూర కొమ్ములు, ధూపంతో ఉద్వేగభరితంగా అమ్మవారు ముందుకు సాగుతారు. అమ్మవారిని గద్దెలపైకి తెచ్చే ముందు చలపయ్య పూజమందిరంలో ప్రధాన పూజారులు విడిది చేసి ప్రత్యేక రహస్య పూజలు చేస్తారు. అక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. అమ్మవారి సేవలోనే పూజారులు కొన్నిగంటల పాటు నిమగ్నమై ఉంటారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి ఎదురేగి కోళ్లు, మేకలను బలిచ్చి స్వాగతం పలుకుతుంటారు.

డోలు దరువు.. ధూపంతోనే ముందుకు

డోలు దరువు, ధూపం అంటే అమ్మవారికి ఎంతో ఇష్టం. ఆ దరువు విని, మైసాచ్చి ధూపాన్ని స్వీకరిస్తేగాని సమ్మక్క ముందుకు సాగదు. డోలు వాయిద్యా కళాకారులు ఎంత సమయం వాయించినప్పటికీ వారికి అలసటనేది రాకపోవడం అమ్మవారి కృప. అంతేకాకుండా ఎదురువచ్చే దుష్టశక్తులు బూర కొమ్ముల శబ్దాలతో పారిపోతాయని వారి విశ్వాసం. తమ ఊపిరిని బిగపట్టుకొని బూర కొమ్ములు ఊదినప్పటికీ వారు ఒక్క క్షణం కూడా నీరసించకుండా ఉత్సాహంతో అమ్మవారికి స్వాగతం పలుకుతూ ముందుకు కదులుతారు.

వారం రోజులు ఉపవాసం



మేడారం జాతర సందర్భంగా కొండాయి గ్రామంలోని గోవిందరాజులకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. వారం రోజులపాటు ఉపవాసం ఉండడంతోపాటు, కాళ్లకు చెప్పులు లేకుండా ఉంటాం. బుధవారం సాయంత్రం దొడ్ల గ్రామంలోని సారలమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు చేసి, కొండాయి చేరుకుంటాం . గుడిలో గోవిందరాజుల పడిగెకు ప్రత్యేక పూజలు చేసి వడ్డె అయిన పొదెం బాబుకు అధికారుల సమక్షంలో అప్పగిస్తాం. మళ్లీ అప్పగించాలని మౌఖిక ఒప్పందం చేసుకుంటాం. పూజ కార్యక్రమాల అనంతరం వడ్డె బాబు గోవిందరాజుల పడిగెను కొండాయి నుంచి మేడారం తీసుకెళ్లి గద్దెలపై పూజలు చేసి ప్రతిష్ఠిస్తారు. పడిగెను పట్టుకున్న వడ్డెకు నీటిని తాకకుండా తీసుకెళ్లడం ప్రత్యేకత.

- దబ్బగట్ల గోవర్ధన్, గోవిందరాజులు ప్రధాన పూజారి, కొండాయి

స్వామి ఆవహిస్తాడు



పడిగెను చేతుల్లోకి తీసుకున్న తర్వాత గోవిందరాజుల స్వామి ఆవహిస్తాడు. స్వామి నా చేతులో ఉన్నంత వరకు ఎక్కడికి వెళ్లేది, ఎటు పోయేది ఏదీ జ్ఞాపకం ఉండదు. వెంట ఉన్న వడ్డెలు తోలుకొని పోతారు. అలా వెళ్లిన తర్వాత మేడారంలోని సమ్మక్క గుడికి వెళ్లి అక్కడ పూజలు చేసి పగిడిద్దరాజును ప్రతిష్ఠిస్తాం.

- పొదెం బాబు, వడ్డె గోవిందరాజులు